# వరశుల్కము

శ్రీపాద జోగి సోమయాజులుగారు

## ౧

## సాంఘిక దుస్థితి

నేత్రములా తామరరేకులబోలె దీర్ఘములు విశాలములు. కురులు నల్లని కాటుకరంగుతో పిరుదుల వరకు వ్రేలాడుచున్నవి. చామనచాయ. వయస్సు పదునొకండు వత్సరములు. పాఠశాలలో నాల్గవతరగతియందు చదువుచున్నది. సంగీత మనిన మిక్కిలి ప్రీతి. దీనులయెడ జాలిమెండు. పాపము! సుశీలకు యిప్పటి బాలికల వలె ఆభరణములు లేక మెడలో మూడుపిల్లకాసులును, కాళ్లకు కడియములు మాత్రమే కలవు. సుశీలకు రాట్నమనిన నెంతయో ప్రియము. తీరుబాటుసమయములం దెప్పుడు కాలము వ్యర్థముచేయక రాట్నము త్రిప్పుచు, ఇరువదియవనంబరు వరకు రాట్నముపై నూలును తీయుట కలలాటునడెను. ఆమెకు ఖద్దరు గట్టుటయందే యభిలాష.

సుశీలకు ఇద్దరక్కలును నొక సోదరుడును గలరు. సోదరు డింకను చిన్నవాడు. తండ్రి కృష్ణయ్యగారు. సాధారణ సంపన్న గృహస్థులు. తనకు భూమిపైవచ్చు నాల్గువందల రూపాయలతోను, ఋణము చేయక, తనభార్యను నల్గురుపిల్లలను పోషించుకొనుచుండెను. పెద్దకుమార్తెయగు సత్యవతికి అన్యోన్యదశలుగల సంబంధము చేయ నెంచి యెక్కడను తగుసంబంధము దొరకక వెదకివెదకి చివరకు వెయ్యి నూటపదార్లు కట్నమిచ్చి భూవసతిలేని యొక స్కూలుఫైనలు విద్యార్థికిచ్చి వివాహము చేసెను. పాప మామె రజస్వలయైన మొదటి వత్సరమునందే యామె భర్త కాలగతి నొందెను. కృష్ణయ్య తన పెద్ద కుమార్తె వివాహమునకు చేసిన రెండువేలరూప్యముల ఋణము తీర్చుటకు సాలునకు నూరురూపాయల ఆదాయమువచ్చు తన రెండు యకరముల పల్లపుభూమిని విక్రయించి సత్యవతినిగూడ తన గృహమందే యుంచుకొని కాలము గడుపుచుండెను.

కృష్ణయ్య తన పెద్దకుమార్తెను వివాహముచేసిన మరువత్సరమునందే ద్వితీయపుత్రిక అన్నపూర్ణకుగూడ వివాహము చేయవలసివచ్చెను. సత్యవతికి వరుని వెదకుటకే పడరానిపాట్లు పడెను. యీ వసుగలవరునకు గుణవిద్యలు లేవు. విద్యగలవానికి వసతి సున్న. వసతిగలవానికి వయసు లెక్కువ. మఱియు నిం దేతరగతివానికైన వేలకువేలు కట్నములు. ఇట్టిస్థితిలో అన్నపూర్ణకు వివాహముచేయుట కెట్టులును దోచకయుండెను. తన కున్న దెల్ల తెగనమ్మి యల్లునకు కట్నముల నొసగి తనయేకపుత్రుని కక్షయపాత్ర చేతి కివ్వజాలను. కట్నము లివ్వక తనగారాబుపట్టిని అన్నములేనివానికిని జ్ఞానహీనునికిని, పరిణయము చేయనొల్లను. హా! దైవమా! యెట్టులనాగతి యని విచారించి విచారించి తుదకు ఆరువందలరూప్యములు వరునకును, వందరూపాయలు వరునితల్లికిని, వందరూపాయలు పెండ్లికుమారుని యక్కచెల్లెండ్రకును, యెనిమిదివందలు కట్నములతో నిచ్చి గొప్పగా పెండ్లిచేసెను. తరువాత నొక వత్సరము గడచెను.

## ౨

సుశీల కిప్పుడే పదునొకండవవత్సరము. వివాహము చేయు సమయము చాటుచున్నది. పిల్ల యీడేరిన లెమగృహము నేటిలో గట్టుకొనవలెనని తల్లి గుసులాడుచుండెను. కృష్ణయ్య




భార్య సుశీల వివాహముసంగతి జ్ఞప్తికిదెచ్చుచు ప్రతిదినమును పోరుపోయుచుండెను. కృష్ణయ్య యిదివరకే తనకు వచ్చు నాదాయమందు సాలుకు నూటయేబదిరూపాయల ఆదాయమువచ్చుభూమిని సత్యవతి అన్నపూర్ణలవివాహము నిమిత్తము విక్రయించెను. ఇక మిగిలినయాస్తితో తనకుటుంబపోషణ మెట్లుజరుగును? తనయనుంగుపట్టి సుశీల వివాహము చేయుటెట్లు? సుశీలకు వివాహము చేసి తనయేకపుత్రునికి విద్యాబుద్ధులు గఱపి యాతని నొకకుటుంబికుని

జేసి పోషించుటెట్లా యని తనలో తాను గుందుచుండెను. భార్య దృష్టికి తెచ్చునపుడు అన్నము సహింపదు. కంటికి రాత్రి కూర్కురాదు. రాత్రి పరుండునపుడెల్ల "రామచంద్రప్రభూ! ఏల నన్నీలీల సృజించితివి? సృజించియు నేల యీసంసారము గల్పించితివి? కల్పించితివి పో ఆడుసంతానము నేల యిచ్చితివి? అందును బెక్కుపుత్రికల నేల నొసంగితివి. తండ్రీ! యేమాహాత్ముడీకట్నముల బెట్టెనో కదా! సామాన్యకుటుంబము లెన్నియోవరకట్నముల వేగుల్లలగుచున్నవో కదా! నాబోటివాండ్రనంతా రూపుమాపుటకీవరకట్నపిశాచ మందరినికూడ నావహించుకొని యున్నది. తండ్రీ! నన్నీసముద్రమునుండి యెట్లుదరిజేర్చెదవు? స్వామీ!" యని విచారించుచుండును.

ఇది యిటులుండ అన్నపూర్ణభర్త తనకు మరల మూడువందల రూప్యములు ఇచ్చినగాని ఔపాసనకార్యమును జరిగించుకొననని అలిగి కూర్చుండెను. "'గోరుచుట్టుపై రోకటిపోటన్నట్లు' ఇదియేమి భగవంతుండా గొప్పగొప్పవారు పెద్దలు, అందఱుగూడ వివాహములకు గట్నము లనుచు బెట్టి సామాన్యసంసారములను మాపెట్టుచున్నారు. ఇప్పుడు గర్భాధానమునకుగూడ కట్నమేమిరా? అల్లునికి కట్నమివ్వనా? కూతునల్లునికడకు బంపక యూరకుందునా?' యని కృష్ణయ్య విచారించుచుండెను.


రోజులు జరుగుచున్నవి. ఎక్కడ ప్రయత్నించినను సుశీలకు సంబంధము కుదురలేదు. పదునాల్గవ వత్సరము దాటుచున్నది. రజస్వలయైన చిక్కు. సాధారణముగా నెక్కడకు వెళ్లినను సంబంధమున కేదో మచ్చ యుండక తప్పినదికాదు. స్వగ్రామములో వాండు దేవశాస్త్రిగారికుమారుడు శ్రీరామమూర్తి అనుయువకు డొకడు అన్నివిధముల నచ్చినవాడుండెను గాని యాతడు పెద్దచదువరి యగుటచే వేలకొలది కట్నముల నడుగునేమోయని భయపడి యాసంబంధముకొఱకు ప్రయత్నించక మిన్నకుండెను.

ఇటులుండ కృష్ణయ్య అగ్రహారములో నొకసంబంధ మున్నదని తెలిసి యచ్చటకు వెళ్లెను. వరుడు బి. ఏ. తరగతియందు చదువుచున్నాడు. హూణవిద్యకై విక్రయించినందున బి. ఏ. యనుయక్షరములు రెండుతప్ప వసతి సున్న. తండ్రి వేదాధ్యయనపరుడు. వసతిసంగతి దెలిసికొనుటకు కృష్ణయ్య అగ్రహారముపోయినపు డాపరుని కాదాయ మేమియు లేకున్నను, ఆతనికి సాలునకు నాల్గువందల రూపాయీలు వచ్చునని అగ్రహారములోనివారెల్లరు, చివరకు కృష్ణయ్యగారి బంధువులుగూడ బల్కుచుండిరి. కాని కృష్ణయ్య పాపమిదియంతయు కల్లయని తెలిసికొనజాలకుండెను. ఎటులయినను బాగున్నదని తలచి, సుశీలను వివాహము చేయుట అతిలోంచకుండుటచేతను, ఇప్పటికే సంబంధములకొఱకు చాలకాలమునుండి తిరుగుచుండుటచేతన్ను, ఈసంబంధమును స్థిరపరచుకొనవలెనని నిశ్చయించుకొనెను.

వరుని యింటిపేరు సత్యవరపువారు. తండ్రి వీరామధానులుగారు. ఇంతవరకు కట్నములను దీసికొనుట పుత్రులను విక్రయించుకొనుట యనియు, పరులకు సొమ్ముకొఱకు అమ్మబడినవాడు తండ్రికి సుతుడు గాడనియు ధర్మపన్నములు చెప్పుచుండెడు ఘనుడు. అట్టి యీవీరామధానులుగారు తనకుమారుని పదునైదువందల రూపాయీలకు బేరముపెట్టినారు. ఎవరైన పెద్దలు "యేమండీ! మీరు కట్నములు కూడవని పల్కెడువారుగదా! యేమిది?" యనిపలుకగ "ఏమి చేయను బాబు! మా అబ్బాయి బి. యే. చదువుచున్నాడని ప్రతివారును సంబంధములకొఱకు వచ్చుటతోడనే వందలకొలది కట్నమిచ్చెద మని పల్కుచున్నారు. మే మడుగకుండనే వా రిచ్చెదమన్నప్పుడు మే మెట్లు మానుకొనగలను. అయినను కట్నముకొఱకు వేధించు మా స్త్రీలమాటలు తీయుటకు వీలుచిక్కనదికాదు" అని వారు చెప్పుచుండెడువాడు.

కృష్ణయ్య గోత్రాదులనెల్లను తఱచిచూచి అడ్డులేదని తెలిసికొని చివరకు వేయిరూప్యములు రొక్కమున్ను, ఇంకను యేవియో లాంఛనములు యిచ్చుటకు యేర్పరుచుకొని తాంబూలము చేత బెట్టి ముహూర్తము పెట్టుకొని నిజగృహమునకు బోయెను.

ముహూర్తము మాఘశుద్ధపంచమి. అప్పటికి సరిగా నొకమాస మున్నది. కృష్ణయ్య యొక్కచోట పదునైదువందల రూప్యములు బదులు తెచ్చి వివాహప్రయత్నములు మిక్కిలి చురుకుగా జేసికొనుచుండెను. వివాహము పదిదినము లున్నదనగా నాటి మధ్యాహ్నము తపాలమునిషి మూడుగంటలకు కృష్ణయ్యగారి కొకయుత్తరము దెచ్చెను.




ఆయుత్తరమును దీసికొని కృష్ణయ్య తనలో చదువుకొని నిర్ఘాంతపోయి పెద్ద నిట్టూర్పు విడచెను. అం దిట్లున్నది:

అగ్రహారము,

అయ్యా, పుష్య బహుళ ౮, గురువారం.


నా కుమారునకు మొన్నటిరోజున నొకరు వచ్చి పన్నెండువందలరూప్యములు రొక్కమున్ను, లాంఛనములున్ను, ఉభయఖర్చు

లున్నా పెట్టుకుని పిల్లనిచ్చుటకు వచ్చియున్నారు. నాల్గు రోజులలో కబురుచేసెదమని వారిని బంపితిమి. మీ యభిప్రాయమేదియో వ్రాయవలయును.

చిత్తగింపుడు,

స. వీరామధానులు.

"ఆహా! యేమి కలికాల మహిమ. నిశ్చయింపబడిన సంబంధమెట్లు తిరిగిపోయినది? ఈరోజులలో ఈవరకట్నములెంతెటిపండితులైనను తుచ్ఛకృపణులకు బాల్పడచేయుచున్నవి. ఏనాడో నిశ్చయించబడిన సంబంధమునకు రొక్కవరకట్న మిచ్చెదనన ఘనమున కాశించి యీబ్రాహ్మణు డిట్లుచేసెగదా! నేటి జనములలో బ్రతివాడును పుత్రులను సంతలో గిత్తవలె నమ్ముకొనుటయే కాక నిర్ణయించబడిన బేరములనుకూడ త్రోసిపుచ్చుచున్నారు. అందును అగ్రగణ్యులమని చెప్పుకొనువారే యిట్లాచరించుచుండ తక్కినవారినాంలిక లెక్కయేల?" అని కృష్ణయ్యగారు తనలోననుకొనుచు మనస్సున నెంతయు వగచి యేమిచేయుటకును వీలులేకను, ఇక సంబంధముల కొఱకు తిరుగలేకను, వివాహప్రయత్నములన్నియు బూర్తి యగుట చేతను, కుమార్తెకు తత్క్షణమందే వివాహముచేయుట విధి యగుట చేతను, యేమియు దోచక తాను తన స్నేహితు నొకని వెంటబెట్టుకొని అగ్రహారమునకు బయలుదేరెను. వారిద్దరును అగ్రహారమునకు బోయి వీరామధానులుగారితో "అయ్యా, తమకిది తగునా? నిశ్చయమైనసంబంధము నిట్లు త్రోసివేయుదురా?




యని యడుగ "డబ్బు యిచ్చెదమని నచ్చుచుండగా యేమిచేయమయ్యా" యని బదులు చెప్పెను. అందుమీద వీరిద్దరును యికచేయునదిలేక ప్రయత్నములు పూర్తియగుటచే వివాహమునకయ్యెడి యుభయులఖర్చులనుగూడ కృష్ణయ్యగారే వహించి వివాహము జరుపుటకు నిశ్చయించుకొని తిరుగ నింటికి వచ్చిరి.

పెండ్లి నాల్గుదినము లున్నది. బందుగులనందరను పిలుచుకొనిరి. బందుగులందరొక్కరొక్కరే రామొదలిడిరి. సుశీల పెండ్లికూతురాయెను. అందరు యెట్టకేలకు సంబంధము నిశ్చయమయ్యెగదా యని సంతసించుచుండిరి. కృష్ణయ్యగారియిల్లు వివాహశోభచే కలకలలాడుచుండెను. ఒకయువకు డింతలో "కృష్ణయ్యగారి ల్లిదేనా?" యని సైకిలునుండి దిగి ప్రశ్నించి "కృష్ణయ్యగారున్నారా?" యని యడిగెను. కృష్ణయ్యగారు బయటికేగి యేమని నాయువకుని సవాలువేయ నాతడొకకవరు నాయన కిచ్చెను. కృష్ణయ్య యాకవరు నందుకొని చింపి దానిలోనికాగితమును దీసి యందుండునది హూణభాష యనుటచే దోయక తనయింటికి బంధుత్వమునకై వచ్చిన యొకయువకుని చేతి కా కాగితము నిచ్చి చదువుమనెను. అం దిట్లుండెను:

Agraharam

"My son not willing marriage this year. No marriage.

Veeramadhanulu.

ఆకడిది వరుని తండ్రియగు వీరామధానుల కడనుండి వచ్చిన తంతియనియు, అందు తనకుమారుని కీ సంవత్సరము వివాహము చేసికొనుట కిష్టము లేదనియు, అందుచే వివాహము లేదనియు వ్రాసియుండెనని కృష్ణయ్య కాయువకుడు చెప్పెను.

ఆమాటలువినుటతోడనే కృష్ణయ్య నిర్ఘాంతపోయి యేమియు దోచక నొక యరగంటవరకు మాటలాడ లేకుండి కొంతసేపటికి లేచి లోనికి జని యాతని భార్యతో నిదిదెల్ప నందఱు నిర్ఘాంతపోయిరి. అప్పుడక్కడి జనులందఱు వారిలోవారు, "వీరామధానులు చదువు తగులబెట్టనా! ఆరడిన్నిసార్లు కృష్ణయ్యగారిని బాధించుట తగునా! ఇష్టములేనివాడు మొదటనే తెల్పరాదా! యీ సమయమందు కృష్ణయ్యగారు పడు క్షోభయంతయు వీరామధానులు గారికి తగులదా! దగాకోరు నెపములు కావలసినంత కట్నము తీసుకొని, పైగా వివాహపుఖర్చుల కొఱకుయేడ్చి యింకొక సంబంధము వచ్చినదని యుత్తరము వ్రాయగా పాపము కృష్ణయ్యగారు వెళ్ళి ఖర్చులుగూడ వహించెదనని చెప్పగా నొప్పుకొని తిరుగా నిట్లు తంతివార్త నిత్తురా" యని వారిలోవారు వీరామధానులను, "బి. ఏ. చదివినయతని కుమారుని కీ మాత్రము జ్ఞానము లేకపోయెనా!" యని యాతని కుమారుని నోటికి వచ్చిన ట్లెల్ల దిట్టుచుండిరి.


పాపము! కృష్ణయ్యగారి కేమియు దోచుటలేదు. కుమార్తె వివాహము నెంతమాత్రము ఆపుటకు వీలులేదు. వివాహప్రయత్నము

లన్నియు జేయబడినవి. బంధుగులందఱు వచ్చిరి. ముహూర్తము నాల్గు దినములున్నది. ఇప్పటికే సంబంధము దొరకక, దొరకియుగూడ పడరాని పాట్లు పడెను. ఇట్టిస్థితిలో, నీ దినమున, నీ సమయమందు కృష్ణయ్య మనస్సెట్లుండునో కృష్ణయ్యబోలు కన్యలు గల్గినవారికే యెఱుకగాని, వేలకొలది రూప్యములకు తమ కడుపునబుట్టిన పుత్రుల మాంసము నమ్ముచు, కన్యలు గలవారి రక్తమును బీల్చుచు, గొంతెమ్మ కోర్కెల గోరెడువారి కేమియెఱుక. ఏమైనను సరియే యని కృష్ణయ్య "ఛీ! యిట్టి యధమాధమునియొద్దకు మరల బోగూడ"దని తలచి సర్వమునకు భగవంతునిదే భారమని యప్పటి కూరకుండెను.

## 3

## రామచంద్రమూర్తి

రామచంద్రమూరియనియు, రామచంద్రుడనియు రెండు నామముల నితని తన గ్రామములోని వారు పిలచెదరు. ఎఱ్ఱనిచాయగల మేనివాడు. విశాలమగు వక్షస్థలము, పెడదలై విశాలములగు నేత్రములు, పొడవైన బాహువులు గలవాడు. కడు బుద్ధికుశలత గలవాడు. దీనులయందు ప్రేమమపారము. అసహాయులగు నితరులకు శేతనైనసహాయముచేసితీరువాడు. మాతృభాషయం దభిమానమెక్కువ. వయస్సు పదునెనిమిది వత్సరములు. సాలునకుపదునైదువందలరూప్యములాదాయము వచ్చువాడు. వాసుదేవశాస్త్రిగారికి యేకపుత్రుండు. వార్తాపత్రికలు నిరంతరముచదువుచుండును. ఇంటరు మీడియేటు తరగతియందు చదువుచు గాంధిమహాత్మునిబోధవిని చదువుమానిరాట్నమే శరణ్యమని రాట్నము ద్రిప్పుచుండును. ఖద్దరు గట్టుటయందు మిక్కిలి యిష్టము గలవాడు.



"బాగు! నాయనా! నీమాటకు నే నెదురీతునా? సరేకాని"

రామచంద్రునకు పంద్రెండవ సంవత్సరము రాకుండగనే నాలుగైదు వేలవరకు కట్నమిచ్చెదమని వచ్చుచుండిరి గాని, తండ్రి రామచంద్రునికి పదునెనిమిదివత్సరములు వచ్చువరకు, వివాహముచేయనని పల్కుటచే వెడలిపోవుచుండిరి. కృష్ణయ్యగారి బుద్ధి రామచంద్రమూర్తిమీద నుండెను. కాని కట్నమివ్వలేక కృష్ణయ్యగారీసంబంధముకొఱకు ప్రయత్నించలేదని యిదివరకే తెల్పియుంటిమి. కృష్ణయ్యగారు తమస్వల్పాదాయముతో తమ ముగ్గురుకుమార్తెలకు వివాహముచేయుటయందు పడెడు బాధలజూచి రామచంద్రుడు మిక్కిలి జాలిపడుచుండును. వార్తాపత్రికలలో నొక దినమున వరశుల్కములను గూర్చిన వ్యాసమునుజదివి యీవరకట్నము లన్ని జాతులయందును సామాన్య సంసారముల నెట్లు గుల్లచేయుచున్నదియు జూచి తనలో తాను కట్నము తీసికొనగూడదని నిశ్చయించుకొనెను. మఱియు కట్నము దీసికొను నితరులకుగూడ వరకట్నమన పుత్రులను బానిసలవలె పరుల కమ్ముకొనుటయనియు, కట్నములవల్ల దేశమెన్నివిధముల పాడగుచున్నదో యవియన్నియు ప్రజలకు దెలియజెప్పుచు కట్నములు మాన్పుటకు ప్రయత్నించుచుండును. మనదేశములో నేనాయకులును, యేపత్రికలును, యేపండితులును, ఈదేశమందుబుట్టిన నిట్టిఘోరమగు సాంఘికదురాచారమను చీడను నశింపచేయుటకు కలుగజేసికొనక యున్నందులకు మిగుల వగచుచుండువాడు.

తండ్రి వాసుదేవశాస్త్రిగారు వీరామధానులు వంటివారుగారు. ఆయన జాలిగల హృదయముగలవాడు. సద్వంశములోనివాడు. పేరు కీర్తులు గలవాడు. ఏకపుత్రుడగుటచే రామచంద్రమూర్తి యెట్లు చెప్పిన నట్లు వినుచుండును. రామచంద్రమూర్తికి కృష్ణయ్యగారి కుమార్తె సుశీలయం దనురాగ మెక్కువ. ఆమె ఖద్దరునందును చరకాయందును జూపు ప్రేమ రామచంద్రునికి సంతసము గొలుపుచుండెను. కృష్ణయ్యగారు నేటివఱకు సుశీల వివాహమునకై పడిన పాట్లు యెప్పటికప్పుడు తనతండ్రికి నివేదించుచు నేడు కృష్ణయ్యగారికి వచ్చినతంతివార్త సంగతి గూడ దెల్పి "నాయనా! యీయన కట్నము నివ్వలేకను, యివ్వచుగూడ నిట్లు బాధపడుట నేను చూడజాలను గనుక నేనే సుశీలను వివాహమాడెద" నని తండ్రితో దెల్ప వాసుదేవశాస్త్రిగారు "బాగు! నాయనా! నీమాటకు నే నెదు

దీతునా! పరేకాని" మ్మని ఒప్పుకొని వెంటనే కృష్ణయ్యగారికి కబురుచేసిరి. కృష్ణయ్య "ఏమి మాయదృష్ట" మని యుప్పొంగెను. అతని బంధువులయొక్కయు, భార్యయొక్కయు సంతోషమునకు మేర లేకుండెను. సుశీల సంతోష వార్ధి నోలలాడుచుండెను. వేలకు వేలు కట్నమిచ్చెదనని వచ్చు వారినివదలి కట్నములిచ్చి వివాహముచేయజాలక సుశీలకొఱకు పలు కష్టములకు లోనై భగవంతునిమీద భారమువేసికొనియున్నకృష్ణయ్య గారికుమార్తెను రామచంద్రుడు వివాహ మాడనున్నందులకు ప్రజలందఱు వానిని మెచ్చిరి. ఒక్కదినముననే వాసుదేవశాస్త్రిగారికిగూడ సన్నాహము లన్నియు పూర్తికాగా కృష్ణయ్యగారి బంధుగులందఱువెడలకుండగనే ఆముహూర్తముననే-మాఘశుద్ధపంచమిరోజున-గాఢానురాగముగల రామచంద్రమూర్తికిని,సుశీలకును,కట్నమేమియు లేక మహావైభవమున బెండ్లి అయ్యెను. ఆహా! వరకట్న దురాచారము మాన్పుటకు రామచంద్రమూర్తియే మార్గదర్శకుడుగావలెగదా!

# "కాకమా! నీవు విను విశ్వగానమేమి?"

కాళూరి వెంకటరామారావు గారు

దివ్యశాతమిజలములఁ దేలివచ్చు
మ్మానిపైనుండి నిశ్చలధ్యానగరిమ
పొంగిపారలెడి మేటితరంగసంఘ
జనితసంగీతమర్మరశబ్దమందు
కాకమ ! నీవు విను విశ్వగానమేమి ?

౨

గగనకల్లోలినీతరంగప్రశస్త
గతినిరాఘాటదిగ్వాగ్ధాటి మెరయు
నేమహామహాకవితాఝరీవిలాస
మందు ఘనభారతామృతం బడరి పొంగు
నట్టి నన్నయకవిచంద్రు నధికభక్తి
వేయినోళ్లను కీర్తి గావించునేమొ?
విమలగోదావరీనదీవీచికలను
కాకమా ! నీవు విను విశ్వగానమేమి ?

3

ధన్యతరమాతృదేశస్వాతంత్ర్యమునకు
వైరిరాట్సైన్యవనదావపావకులుగ
నాహవక్షోణిఁ జరియించు నాంధ్రవీర
దుర్నివారప్రతాపబంధురతనిత్య
విజయగీతావళిఁ మేళవించునేమొ
విమలగోదావరీనదీవీచికలను ?
కాకమా ! నీవు వినువిశ్వగానమేమి ?

౪

తనరామభక్తకీర్తనల నేఁటికి నాంధ్ర
పర్వతతతి ప్రతిధ్వనులీన
తనదుమైకాగ్యతత్త్వముఁ గాంచి నివ్వెర
కరకుతురక లెంతొ గారవింప
తన దేవతాప్రతిష్ఠను ధన్యతనుగంటి
నని భద్రగిరి నాథుఁడమురుకొత్త
తనరామనామమంత్రము గౌతమీ నది
నూర్మికామాలిక లొత్తిపలుక
సదమలానందభక్తిపాశములఁ గట్టి
రామచంద్రునిఁబట్టి భద్రాద్రినిల్పు
గలుగు"గోపన" భక్తశేఖరునికీర్తి
గానమొనరుచునేమొ నిక్కము వచింపు
విమలగోదావరీనదీ వీచికలను
కాకమా! నీవు విను విశ్వగానమేమి ?